బాబోయ్ దుమ్ము!



- ఇబ్బంది పడుతున్న రైల్వే ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌కు సమీపంలో రోడ్డును డైవర్ట్ చేయడంతో వాహనాల రాకపోకలతో పెద్దఎత్తున చెలరేగుతున్న దుమ్ముతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్డు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్ రోడ్డును పక్కనున్న ముళ్ల కంపలను కొట్టి వేసి వాహనాలను మళ్లించారు. తాత్కాలికంగా రోడ్డు కూడా వేయకుండా వాహనాలు, ఆటోలు, ద్విచక్రవాహనాలను మళ్లిస్తూ బోర్డు పెట్టారు. ఈ వాహనాల వల్ల దాదాపు 20 అడుగుల మేర దుమ్ము రేగుతుండటంతో శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న రోగులు తల్లడిల్లుతున్నారు. ఎండల వేడిమితో దుమ్ము మరింత రేగుతోంది. చుట్టు పక్కల నివాసం ఉన్న ప్రజలు సైతం రేగుతున్న దుమ్ము, ధూళితో నరక యాతను అనుభవిస్తున్నారు. పది రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉంది. రోడ్డును డైవర్ట్ చేసినా ఇంత వరకు సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. సిమెంట్ రోడ్డు ఎప్పుడు ప్రారంభిస్తారో.. ఎప్పుడు పూర్తి చేస్తారో ఎప్పటికి వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తారోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం, తెల్లవారుజామున, ఉదయం వేళల్లో ఎక్కువగా రైళ్ల రాకపోకలు ఉంటాయి. వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. మూడు జిల్లాల కేంద్రంగా రైల్వే స్టేషన్ ఉండటంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో దుమ్ము రేగకుండా నీటిని చల్లాల్సిన కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



రోడ్డును డైవర్ట్ చేసినట్లు చూపుతున్న మార్క్



పెద్ద ఎత్తున రేగుతున్న దుమ్ము, ధూళి

శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది

పెద్ద ఎత్తున చెలరేగుతున్న దుమ్ము, ధూళి వల్ల ప్రయాణికులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. తుమ్ములు, దగ్గు ఎక్కువవుతోంది. నిర్వహణ లేకపోవడంతో శ్వాసకోశ వ్యాధులున్న వారు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కణాలు ఊపిరి తిత్తుల్లోకి వెళ్లి ఉబ్బసం వ్యాధులకు కారణమవుతున్నాయి. ప్రయాణికులతో పాటు చుట్టు పక్కల నివసిస్తున్న వారి పరిస్థితి ఇంచు మించు ఇదే. తాడిపత్రి – విజయవాడ రైలు కోసం రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో చేరుకుంటారు. తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ఇంటర్ విద్యార్థులు విజయవాడలో అధికంగా చదువుతున్నారు. వారిని డ్రాప్ చేయడానికి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఎక్కువగా మోటర్ సైకిళ్లపై వస్తుంటారు. రోజూ రాత్రి 7.30కు తాడిపత్రి నుంచి విజయవాడకు రైలు బయలుదేరుతుంది. ఆ సమయంలో 100కు పైగా మోటర్ సైకిళ్లు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో భారీగా దుమ్ము, ధూళి రేగుతుంటుంది. ముందున్న వాహనాలు కూడా కనపడని పరిస్థితి. మిగిలిన సమయాల్లో ఉద్యోగులు జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఉదయం రైల్వే స్టేషన్‌లో మోటర్ సైకిళ్లను పెట్టి సాయంత్రం తిరిగి వాటిని తీసుకెళుతున్నారు.



ఇంట్లోకి దుమ్ము వస్తోంది



రోడ్డును డైవర్ట్ చేయడం వల్ల మట్టి రోడ్డుపై వాహనాలు వెళ్తుండడతో ఇంట్లోకి దుమ్ము వస్తోంది. ఇంట్లోకి దుమ్ము రాకుండా కర్టెన్ వేసుకున్నా ఫలితంలేదు. కొన్ని సార్లు తలుపులు మూసుకుంటున్నాను. సిమెంట్ రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయో, దుమ్ము నుంచి ఎప్పుడు తప్పించుకుంటాయో తెలియడం లేదు.

– నూర్జహాన్, తాడిపత్రి

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రయాణికులు సహనం పాటించాలని, దుమ్ము, ధూళి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. దుమ్ము, ధూళి రేగకుండా నీళ్ల చల్లాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. రైల్వే స్టేషన్ అధునికరణ పనులు జరుగుతున్నాయి. ప్రయాణికులు సహకారం అందించాలి.

– అనిల్‌కుమార్, స్టేషన్ మాస్టర్

క్లుప్తంగా

హైవే పనులు అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, హైవే అధికారులు

తాడిపత్రి రూరల్: డైవర్షన్ రోడ్డు, కాలువ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై హైవే పనులను మంగళవారం బొందలదిన్నె గ్రామస్తులు అడ్డుకున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా నిర్లక్ష్యంగా ఉండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాడిపత్రి– కడప రహదారిపై ఆందోళన చేశారు. గ్రామస్తులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, హైవే ఇంజినీరింగ్ అధికారులు వచ్చి గ్రామస్తులను సర్దిచెప్పారు. డైవర్షన్ రోడ్డు, కాలువ నిర్మాణ పనుల మంజూరుపై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి

పామిడి: పట్టణంలోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రిలయన్స్ ట్రెండ్స్, ఫాక్స్‌కాన్, మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, లేబర్‌నెట్ ఫౌండేషన్ తదితర కంపెనీలు ప్రతినిధులు హాజరవుతారన్నారు. మరిన్ని వివరాలకు 8096763970 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎద్దులపల్లిలో చిన్నపిల్లల ఆధార్‌క్యాంపు



ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో ఎంపీడీఓ కే తేజోత్స్న ఆధ్వర్యంలో చిన్నపిల్లల ఆధార్‌క్యాంపును మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఐదేళ్లలోపు పిల్లలు తమ ఆధార్‌ను నమోదు చేసుకోవడానికి క్యూకట్టారు. ఈ నెల 28 వరకూ నిర్వహించే ఆధార్ క్యాంపును చిన్నపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలి



మిడుతూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీమ్‌బాషా

పెద్దవడుగూరు: ఉపాధి పనులు నాణ్యతగా చేయాలని డ్వామా పీడీ సలీమ్‌బాషా సూచించారు. మంగళవారం మండలంలోని మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని అమృత్ సరోవర్ కార్యక్రమంలోభాగంగా చేపట్టిన పనులను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దవడుగూరు కమ్యూనిటీ సోక్ పిట్‌కు భూమి పూజ చేశారు. ఇదివరకే చేసిన కమ్యూనిటీ సోక్ పిట్ లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ పుల్లారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీవాణి' విద్యార్థులకు యంగ్ జీనియస్ అవార్డు



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న మంత్రి తుమ్మల, నటుడు రావురమేష్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వడ్లపాలెంలో ఉన్న శ్రీవాణి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యంగ్ జీనియస్ అవార్డు అందుకున్నారని మంగళవారం కరస్పాండెంట్ నీలకంఠ తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్‌లో జరిగిన సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులను తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, నటుడు రావురమేష్ అందజేశారన్నారు. పాఠశాలకు చెందిన మహీరా రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి, సీహెచ్.వన్‌టూసిక్స్, యజ్ఞశ్రీ, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి అందుకున్నారు. రేవంత్, మహ్మమద్, , ఆఫాన్, ఆరిబ్, టీఎస్ హనియా జిల్లా స్థాయిలో రెండో బహుమతి అందుకున్నారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

గుంతకల్లు: రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.గోవిందు డిమాండ్ చేశారు. ఈ నెల 22, 23న కడపలో నిర్వహించే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం ప్రాజెక్టుల మహాసభను విజయవంత చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా రాయలసీమ మారిందన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా హంద్రీనీవా, గాలేరు, నగరి ప్రాజెక్టును వచ్చాయని గుర్తు చేశారు. అయితే నేటికి ఈ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. హంద్రీనీవా కాలవను 10వేల క్యూసెక్కులకు పెంచి సాగు భూములకు నీరు ఇవ్వకుండా ఇప్పుడు రెండో దశ కాలువకు లైనింగ్ చేయడానికి పూనుకున్నారని, ఈ కాలవకు లైనింగ్ చేస్తే జిల్లా రైతులకు ఉరితాడు బిగించినట్లే అవుతుందన్నారు. కావున హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడంతోపాటు ఆయకట్టుకు పిల్లకాలువలు ఏర్పాటు చేసి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీటి కోసం 22,23వ తేదీల్లో కడపలో చేపట్టిన మహాసభలో పెద్ద ఎత్తున అన్నదాతలు పాల్గొని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజినేయులు, సీపీఐ మండల కార్యదర్శి రాయల్‌రాము, నాయకులు ఉమర్‌బాషా, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు గోవిందు

ప్రతిభావంత మహిళలకు ప్రోత్సాహక బహుమతులు

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామానికి చెందిన వివాహితలు సూర్యకాంతం, సుకన్యను మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తేజోత్స్న బహుమతులతో ప్రోత్సహించారు. గత 15వ తేదీ మండలంలోని వంకరాజుకాలువ గ్రామ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన ఆ గ్రామ మహిళలతో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. అందులో వ్యర్థాల విభజన–నిర్వహణకు సంబంధించి ప్రశ్నలకు సూర్యకాంతం సరైన సమాధానాలిచ్చారు. అలాగే తడి–పొడి చెత్తకు సంబంధించి వేర్వేరుగా రెండు డస్ట్ బిన్‌లు వాడతూ ఆదర్శంగా నిలిచిన సుక్యను ఆయన అభినందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ మహిళలను ఎంపీడీఓ కార్యాలయానికి పిలించి స్పెషలాఫీసర్ శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఎంపీడీఓ చీరలను ప్రోత్సాహక బహుతులుగా అందజేశారు.



సూర్యకాంతంకు చీర అందజేస్తున్న ఎంపీడీఓ తేజోత్స్న

ప్రాథమిక అక్షరాస్యతపై శ్రద్ధ వహించండి



తాడిపత్రిలో మాట్లాడుతున్న సీడీపీఓ సాజిదాబేగం



గుత్తిలో మాట్లాడుతున్న ఎంఈఓ రవినాయక్

తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు/యాడికి/యల్లనూరు/గుత్తి/గార్లదిన్నె: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రాథమిక అక్షరాస్యతపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ నాగరాజు, సీడీపీఓ సాజిదా బేగంలు సూచించారు. తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం న్యూ ఎడ్యుకేషన్–2020పై తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలోని 126 మంది అంగన్‌వాడీ టీచర్లకు ఆరురోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం ఫుడ్ ఫీడింగ్‌పై ప్రత్యేక దృష్టి ఉండేదన్నారు. ప్రస్తుతం చిన్నారులకు ప్రాథమిక అక్షరాస్యత, అంకెలను నేర్పించడంపై టీచర్లు శ్రద్ధ పెట్టాలన్నారు. సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, కల్పన, లక్ష్మిదేవి,విజయ, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

- పెద్దవడుగూరులోని జెడ్పీపీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, శంషాద్‌బేగం, హెచ్‌ఎం సుధాకర్‌బాబు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
- యాడికిలోని కోన రోడ్డులో ఉన్న ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ–పడాయి భీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు కాశెప్ప, ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.
- యల్లనూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, ఆర్పీలు గిరిధర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, చెన్నారెడ్డి, సూపర్‌వైజర్ రాజామణి ప్రారంభించారు. యల్లనూరు, తిమ్మంపల్లి సెక్టార్ల నుంచి 43 మంది అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.
- గుత్తి పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగమణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రవినాయక్, సూపర్‌వైజర్లు నాగేశ్వరి, గౌరి తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నెలోని మోడల్ స్కూల్లో బాల్య సంరక్షణ విద్యపై అంగన్‌వాడీలకు ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం అధికారులు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రనాయక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ వాణి, జ్యోతి, రిసోర్స్ పర్సన్లు రంగనాయకులు, గురుప్రసాద్, వివిధ గ్రామాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

తాడిపత్రి రూరల్: ఇళ్ల పట్టాలు, ఇంటి నిర్మాణాలపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతం నుంచి వెయ్యిమందికి పైగా పార్టీ వర్గీయులు, మహిళలు తరలివచ్చి తహసీల్దార్ కార్యాయాన్ని దిగ్బంధం చేశారు. ఇళ్ల పట్టాల దరఖాస్తులను చేత పట్టుకొని నినాదాలు చేశారు. జిల్లానుంచి వచ్చిన సీపీఐ కార్యదర్శి జాఫర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, తాడిపత్రి పట్టణ కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొని ఇళ్లపట్టాలు, ఇంటి నిర్మాణాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అంతకు ముందు టీడీపీ కౌన్సిలర్ల హెచ్చరికలతో తహసీల్దార్ కార్యాలం వద్ద పట్టణ సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యాలయం ప్రధాన గేట్‌ను మూసి చిన్న గేట్ ద్వారా కేవలం లబ్ధిదారులైన మహిళలు, సీపీఐ నాయకులను మాత్రమే లోపలికి అనుమతించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున పంపిణీ కోసం బడ్జెట్ సమావేశాల్లో నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులను అందజేయాలన్నారు. కాగా తాడిపత్రిలో చేపట్టిన ఆందోళనను ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్ అపార్థం చేసుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ విలేకరులకు తెలపడం అక్కడున్న వారిని అశ్చర్యపరిచింది. ఇళ్ల పట్టాల పేరుతో సీపీఐ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని, అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్నారని, పరోక్షంగా ఆందోళనను అడ్డుకుంటామని టీడీపీ కౌన్సిలర్లు సీపీఐ నాయకులను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు పై విధంగా రామక్రిష్ణ స్పందించడం పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేసింది. టీడీపీ కౌన్సిలర్ల బెదిరింపు హెచ్చరికల నుంచి సీపీఐ నాయకులకు ఉపశమనం కలిగేలా మద్దతుగా మాట్లాడుతారనుకున్న ఆ పార్టీ నాయకులకు నిరాశ కలిగింది.



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన లబ్ధిదారులు, సీపీఐ నేతలు

రుణాల కోసం ఇంటర్వ్యూలు

శింగనమల/యల్లనూరు/పుట్లూరు/గార్లదిన్నె/పామిడి: శింగనమల మండలంలో బీసీ, ఈబీసీ, కాపు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలను ఎంపీడీఓ భాస్కర్ పరిశీలించారు.

- యల్లనూరు మండలంలోని యల్లనూరు, తిమ్మంపల్లి, వెన్నపూసపల్లి బ్యాంకుల పరిధిలోని రుణ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. బ్యాంకు మేనేజర్లు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- పుట్లూరు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు 90 మంది హాజరైనట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.
- గార్లదిన్నెలోని గ్రామ సచివాలయంలో మంగళవారం బీసీ సబ్సిడీ రుణాలు కోసం బ్యాంకర్లు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాప్రకృద్దీన్ మాట్లాడుత కెనరా బ్యాంకు, యూనియాన్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు పాల్గొన్నారు.
- పామిడి పట్టణ ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పామిడి మేజర్ పంచాయతీ పరిధిలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఎంపీడీఓ కే తేజోత్స్న ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నిర్వహించిన ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. బ్యాంకు అధికరులు, సచివాలయ సిబ్బంది, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో నేడు..

గుంతకల్లుటౌన్: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. బ్యాంకు, సంబంధిత అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరయ్యే దరఖాస్తుదారులు తగిన ధృవపత్రాలను తీసుకురావాలని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీ కుబేర హోమం

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని భ్రమరాంభిక మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం లక్ష్మీ కుబేర హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ 16వ వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజుల పాటు జరిగిన వేడుకలు మంగళవారం ముగిశాయి. సూక్తక హోమం, లలితాదేవి మూల మంత్రం, ప్రగ్యాంరిరాదేవి హోమం, మహా వారాహి హోమం, నవదుర్గసహిత మహా భైరవ హోమం నిర్వహించారు. తామర పూలతో మహా పూర్ణాహుతి, ఆలయ శిఖరంన మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు యువత నడుం బిగించాలి

గుంతకల్లుటౌన్: వీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందుత్వ ధర్మ పరిరక్షణకు యువత నడుం బిగించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో జరిగిన సభలో ధర్మరక్ష వ్యవస్థాపకుడు, తెలంగాణా బీజేపీ నేత చికోటీ ప్రవీణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సనాతన ధర్మ బోర్డును ఏర్పాటు చేసి దేవాలయాలన్నింటినీ ఆ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్, బీజేవైం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, జిల్లా కార్యదర్శి కేశవ, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ, జనసేన మండల అధ్యక్షుడు పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చికోటి ప్రవీణ్

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

యాడికి: తప్పులు లేకుండా, ఎలాంటి అవకతవకలు జరగకుండా రీ సర్వే నిర్వహించాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని చందన గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం చందన గ్రామ సచివాలయంలో రీ సర్వే సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. రైతుల సమక్షంలోనే రీ సర్వే నిర్వహించాలన్నారు. ఎటువంటి లోపాలు, అవకతవకలు లేకుండా రీసర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. కోర్టు పెండింగ్‌లో ఉన్నవి తప్ప మిగిలినవన్నీ పూర్తి చేయాలన్నారు. చందన రెవెన్యూ పొలంలో 11,159 ఎకరాలు ఉండగా ఇప్పటికే 1100 ఎకరాలు సర్వే చేశారని, సర్వేలో 3 బృందాలు పాల్గొంటున్నాయని ఆర్డీఓకు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, రీ సర్వే డీటీ రాజ్‌కుమార్, వీఆర్వోలు రామదాసు, నరసింహరాజు, రీ సర్వే బృందం, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్: పట్టణంలోని మద్యం, కల్లు దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, జిల్లా అధికారి రామమోహన్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని పలు బార్లు, మద్యం దుకాణాల్లో మద్యం సీసాలను ఏపీ టీఏటీఎస్ యాప్ ద్వారా చెక్ చేశారు. అలాగే కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రసాయనిక పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. అనంతరం పెరిగిన మద్యం రేట్లను తెలియజేస్తూ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయించవద్దని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పాల్ రవి కుమార్

గుత్తి: వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ ఆదేశించారు. గుత్తి ప్రభుత్వాసుపత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. గర్భిణులకు సిజేరియన్ లేకుండా నార్మల్ డెలివరీ చేయడానికి ప్రయత్నించాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు అందించాలన్నారు. గుండెజబ్బుకు సంబంధించిన ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రక్త పరీక్షలు వంటివి వెంటనే చేసి రిపోర్టులు ఇవ్వాలన్నారు. జనన, మరణ రిపోర్టులు ఇచ్చే విషయంలో ఆలస్యం చేయద్దన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరిండెండెంట్ దొరస్వామి నాయక్, వైద్యులు వెంకట రమణ, పరమేష్, రాజేష్, రమ్య శ్రీ, స్టాఫ్ నర్సులు నాగమణి, పద్మా, శ్రీలత, దివ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండలంలోని నిట్టూరు శివారులో మంగళవారం పేకాట ఆడుతున్నారనే సమాచారం రావటంతో సీఐ ఈరన్న తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే మండల కేంద్రంలో మట్కా రాస్తున్న నారాయణ స్వామి అనే వ్యక్తిని అరెస్టు చేసి, రూ.5,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.